‘ఉపాధి’లో అవకతవకలు

● లక్షల రూపాయలు దుర్వినియోగం
● సామాజిక తనిఖీ ప్రజా వేదికలో వెల్లడి


ప్రజా వేదిక సభలో మాట్లాడుతున్న ఏపీడీ శాంతకుమారి

మరిపెడ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో లక్షల రూపాయలు దుర్వినియోగమైనట్లు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో రెండో రోజు గురువారం నిర్వహించిన సోషల్ ఆడిట్ సభలో వెల్లడైంది. ఉపాధి పనుల్లో టీఏ, కార్యదర్శులు సరైన రికార్డులు నిర్వహించలేదని వారి నిర్లక్ష్యంతోనే అనేక అవకతవకలు చోటు చేసుకున్నాయి. ఈ సందర్భంగా డీఆర్డీ ఏపీడీ శాంతకుమారి మాట్లాడుతూ.. 2020నవంబర్ 1 నుంచి 2023 మార్చి 31వ తేదీ వరకు మండలంలో సుమారు రూ.18.22 కోట్ల పనులు చేపట్టినట్లు తెలిపారు. మండలంలోని 44 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్ తనిఖీ బృందాలు పలు అంశాలను వెల్లడించినట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో జరిగిన అవినీతి అక్రమాలను డీఆర్పీల ద్వారా బయటపడినట్లు ఆమె వివరించారు. గ్రామాల్లో చేసిన పనులకు సరైన రికార్డులు లేకపోవడంతో టీఏ, కార్యదర్శులపై ఏపీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. దంటకుంటతండా, ఎల్లంపేట, తాళ్లఊకల్, మూలమర్రితండా, డీఎస్ఆర్ జెండాల్‌తండా, ఎడ్జెర్ల, భూక్యతండా గ్రామాల్లో మొక్కల సంరక్షణ పేరుతో లక్షల అవినీతి జరిగినట్లు డీఆర్పీలు సభలో వెల్లడించారు. అదేవిధంగా ఉపాధి కూలీలకు ప్లే స్లిప్పులు ఇవ్వకపోవడంతో ఎంత నగదు అకౌంట్లో జమ అవుతుదో తెలియడం లేదని పలు గ్రామాల ఉపాధి కూలీలు సభలో ఆవేదన వ్యక్తం చేశారు. అవెన్యూ ప్లాంటేషన్, మల్టీలేయర్ ప్లాంటేషన్, మొక్కలు నాటినట్లు లక్షల రూపాయలు డ్రా చేశారు. కానీ ఎక్కడ 20 శాతం కంటే మొక్కలు బతికి లేవని సభా ముఖంగా వెల్లడించారు. చనిపోయిన వారి పేర్లతో వర్క్ ఐడీల డిమాండ్ నోటీసులు ఎందుకు వస్తున్నాయన్నారు. మల్టీ పర్పస్ వర్కర్లకు ఉపాధి పనులు కల్పించొద్దని తెలిసి కూడా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని మరిపెడ ఏపీఓ మంగమ్మపై ఏపీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు ఉంటాయని ఆమె హెచ్చరించారు. ఎంపీడీఓలు కేలోత్ ధన్‌సింగ్, సింగారపు కుమార్, ఏపీఓ ఎస్.యాకూబ్, అంబుడ్స్‌మన్ జిల్లా అధికారి బెస్త ఆదాం, ఎస్ఆర్పీలు సరేష్, నర్సయ్య, డీఆర్పీలు, జీపీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు



డోర్నకల్ : మండలంలోని తోడేళ్లగూడెం గ్రామంలో గురువారం ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. గ్రామపంచాయతీ కార్యదర్శి తేజ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది, గ్రామానికి చెందిన యువకులు వీధుల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నిషేధించాలని కార్యదర్శి కోరారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ తాళ్లూరి శ్రీను, సిబ్బంది వెంకటేష్ పాల్గొన్నారు.

నియామకం


ఎండి. పాషా

నెహ్రూసెంటర్ : మహాజన సోషలిస్టు పార్టీ(ఎంఎస్పీ) మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన ఎండి పాషాను నియమించారు. తనను గుర్తించి ఎన్నికకు సహకరించిన జిల్లా కోఆర్డినేటర్ గుగ్గిళ్ల పీరయ్య, పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకులకు పాషా కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తనవంతుగా కృషి చేస్తానని ఆయన వెల్లడించారు.

ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడిగా వెంకట్‌లాల్



గార్ల : ఎంపీటీసీల ఫోరం మండలఅధ్యక్షుడిగా ముల్కనూరు ఎంపీటీసీ మాలోత్ వెంకట్‌లాల్‌ను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో ఎంపీటీసీలు భట్టు నాగరాజు, డి.రాజకుమారి, వైస్ ఎంపీపీ కట్టెబోయిన శ్రీనివాసరావు, మంజుల, ఆలోత్ పరేంగణ్, ఎం.సుగుణాదేవి, పి.సుజాత పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు



డోర్నకల్ : స్థానిక నిర్మలా హైస్కూల్‌లో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు యేసుక్రీస్తు జన్మ వృత్తాంతాన్ని తెలియజేస్తూ నృత్య రూపకం ప్రదర్శించారు. పాఠశాల ఆవరణలో క్రిబ్, క్రిస్మస్ ట్రీ ఏర్పాటు చేశారు. హెచ్ఎం థెరిసా, కరస్పాండెంట్ లీనా ఆధ్వర్యంలో క్రిస్మస్ కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచి పెట్టారు.

ఘనంగా గణిత దినోత్సవం



డోర్నకల్ : స్థానిక సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో గురువారం గణిత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. గణిత ఆకృతుల రూపంలో విద్యార్థులు ప్రదర్శించిన తీరు ఆకట్టుకుంది. ఈ సందర్భంగా గణిత శాస్త్ర ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పి.సరిత, ఉపాధ్యాయులు వసంత, మౌనిక, భవాని, రాజా, స్వప్న, సరిత పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి


భీమా నాయక్ (ఫైల్)

డోర్నకల్ : డోర్నకల్ మాజీ సర్పంచ్ బాదావత్ భీమా నాయక్(77) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. భీమా నాయక్ 2006 నుంచి 2011 వరకు డోర్నకల్ సర్పంచ్‌గా పని చేశారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న భీమానాయక్ ఖమ్మంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కాంగ్రెస్ నాయకులు సమేర్ చంద్‌జైన్, మాదా శ్రీనివాస్, ఎల్లావుల హరికృష్ణ తదితరులు భీమానాయక్ మృతదేహం వద్ద పూలమాలవేసి ఘన నివాళులర్పించారు.

విరాళం

గూడూరు : మండలంలోని బ్రాహ్మణపల్లి ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి పృథ్వీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో చల్లా శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు చల్లా సుభాష్‌రెడ్డి గురువారం రూ.50 వేలు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం నాంపల్లి మల్లయ్య యూత్ క్లబ్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు జాబ్‌మేళా

మహబూబాబాద్: దేశంలోని ప్రముఖ ప్రైవేట్ రంగ బ్యాంక్ యాక్సిస్ అధీకృత రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ టైమ్స్ ప్రో ఆధ్వర్యంలో రేపు(శనివారం)స్థానిక సమైక్య డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నారని కళాశాల ప్రిన్సిపాల్ కమటం రమేశ్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఏదైనా డిగ్రీ అర్హత కలిగిన యువకులతో యాక్సిస్ బ్యాంక్‌లో వివిధ ఉద్యోగాలు భర్తీ చేస్తారన్నారు. ఉదయం 10గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తారని ఆసక్తి గల వారు తమ బయోడేటా సంబంధిత విద్యార్హత పత్రాలతో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాల కోసం 97010 11801కు సంప్రదించాలన్నారు.

యాసంగి సాగుపై అప్రమత్తంగా ఉండాలి


పొలాన్ని పరిశీలిస్తున్న శోభన్‌బాబు

దంతాలపల్లి : యాసంగి వరినాట్లు వేసే రైతులు అప్రమత్తంగా ఉండాలని మరిపెడ డివిజన్ ఏడీఏ శోభన్‌బాబు అన్నారు. గురువారం మండలంలోని గున్నెపల్లిలో వరి నాట్లు వేసే పొలాన్ని, నారుమడులను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ.. చలి తీవ్రత ఎక్కువ ఉన్నందున రైతులు వరినారును కాపాడుకోనేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.యాసంగి పొలంలో ఎక్కువగా జింకు లోపం వస్తుందని, అందువల్ల దిగుబడి తక్కువ వచ్చే అవకాశం ఉంటుందని, రైతులు తమ పొలంలో తగిన మోతాదులో జింకు సల్ఫేట్ చల్లుకోవాలన్నారు. జింకును ఉపయోగించడం వల్ల చలి నుంచి కొంత వరకు రక్షణ ఉంటుదన్నారు. అనంతరం రైతులకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి దీక్షిత్, రైతులు పాల్గొన్నారు.

విచారణ చేపట్టాలి

కేసముద్రం : కేసముద్రంస్టేషన్ పట్టణ శివారులో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతంపై అధికారులు విచారణ చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి చొప్పరి శేఖర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆపార్టీ ఆధ్వర్యంలో మండల సర్వేయర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో గతంలో ప్రభుత్వ కళాశాలకు కేటాయించిన ప్రభుత్వ భూమిని, కొంతమంది కబ్జా చేశారని ఆరోపించారు. నాయకులు కాసు సాయిచరణ్, సామ సారయ్య, జూకంటి రవి పాల్గొన్నారు. అదే విధంగా మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల హాస్టల్‌కు ప్రభుత్వం కేటాయించిన స్థలం ఆక్రమణకు గురికాకుండా సరిహద్దులు నిర్ణయించాలని పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్ బొట్టు రమేష్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ వైస్ చైర్మన్ అజ్మీరా బాలు, భూక్యా రవి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

గూడూరు : మండలంలోని భూపతిపేట పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం సీడీపీఓ నీలోఫర్ అజ్మీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లల ఆరోగ్య పరిస్థితులు, పెరుగుదల, ఎత్తు, బరువులను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ టీచర్ల పని విధానాన్ని ఆమె పరిశీలించారు.

నిత్యావసరాల పంపిణీ

తొర్రూరు : సేవా కార్యక్రమాలకు చేయూత అవసరమని మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ తెలిపారు. బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో గురువారం డివిజన్ కేంద్రంలోని లయన్స్ క్లబ్ భవనంలో అనాథ, వృద్ధుల ఆదరణ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అనాథలు, వృద్ధులకు నిత్యావసర సరుకులు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్, జెడ్పీటీసీ మాట్లాడుతూ.. అనాథలు, వృద్ధులను చేరదీయాల్సిన అవసరం ఉందని, విధి వంచితులకు సాయమందించాలని వారు కోరారు. బాల వికాస సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో దాతలు ధనలక్ష్మి, దేవేందర్, బాల వికాస ప్రతినిధులు వై.రమ, మద్దెల రమ, శైలజ, శోభ, సరిత, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పొదుపు ఖాతా ఓపెన్ చేసుకోవాలి

● వరంగల్ జిల్లా తపాలా పర్యవేక్షకుడు ఎస్వీఎల్ఎన్ రావు


మాట్లాడుతున్న ఎస్వీఎల్ఎన్ రావు

మహబూబాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా రూ.500లకే గ్యాస్ సబ్సిడీ, మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వబోతుందని అందుకు అర్హులు పోస్టాఫీస్‌లో పొదుపు(సేవింగ్) ఖాతా ఓపెన్ చేసుకోవాలని వరంగల్ జిల్లా తపాలా పర్యవేక్షకుడు ఎస్వీఎల్ఎన్ రావు కోరారు. స్థానిక ప్రధాన తపాలా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.500 తో పీఓఎస్‌బీ ఖాతా ఓపెన్ చేసుకోవచ్చన్నారు. ఏటీఎం కార్డు ద్వారా ఏ బ్యాంక్ ఏటీఎంలోనైనా డబ్బులు విత్‌డ్రా చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ లావాదేవీలు కూడా చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఉప తపాలా పర్యవేక్షకుడు ఎల్.సైదానాయక్, పోస్ట్ మాస్టర్ పెండ్రా రాంచందర్, సీపీసీ ఇన్‌చార్జ్ అనిల్ కుమార్, ఐపీపీబీ మేనేజర్ డి.సంపత్, బి.సునీత పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

● మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి


సర్వే వివరాలు పరిశీలిస్తున్న రామ్మోహన్‌రెడ్డి

మహబూబాబాద్ : మానుకోట మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం మున్సిపల్ పరిధిలో నిర్మిస్తున్న హిందూ శ్మశాన వాటిక పనులను చైర్మన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే బిల్లులు నిలివేయాలన్నారు. అభివృద్ధి పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. చైర్మన్ వెంట ఇన్‌చార్జ్ కమిషనర్ డీఈ సీహెచ్ ఉపేందర్, కాంట్రాక్టర్లు ఉన్నారు. అలాగే మానుకోటలో మౌలిక సదుపాయాల సమాచారంతో అభివృద్ధి కార్యకలాపాల ప్రణాళికకు ల్యాండ్ ఆధారంగా సైంటిఫిక్ హౌజ్ నంబరింగ్ సిస్టం సర్వే చేశారు. ఈ సర్వేను చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి పరిశీలించారు. సర్వే ఏజెన్సీ సిబ్బందికి పూర్తి వివరాలు వివరించారు.

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రపై అవగాహన


మాట్లాడుతున్న ఎంపీడీఓ సరస్వతీ

కురవి : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమంపై గురువారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సరస్వతీ మాట్లాడుతూ.. భారత ప్రభుత్వం, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల భాగస్వామ్యంతో పారిశుద్ధ్య సౌకర్యాలు, అవసరమైన ఆర్థిక సేవలు, పేదలకు గృహాలు, నాణ్యమైన విద్య, అర్హులైన లబ్ధిదారులందరికి అవసరమైన సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఎంపీఓ రఘుపతిరెడ్డి, ఎంపీటీసీ చిన్నం భాస్కర్, వార్డుసభ్యుడు నూతక్కి నర్సింహారావు, గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ లోకేష్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, డ్వాక్రా గ్రూపు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

తొర్రూరు : ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి పాలకుర్తి శాసన సభ్యురాలు ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం డివిజన్ కేంద్రంలో బీజేపీ అర్బన్, రూరల్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. పాలకుర్తి నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రజలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని, వాటి పరిష్కారంలో ఎమ్మెల్యే చొరవ చూపాలన్నారు. ఎమ్మెల్యే అసెంబ్లీలో ఉంటే సమస్యలు తెలుసుకునేందుకు అధికార యంత్రాంగాన్ని గ్రామాల్లోకి ఎందుకు పంపడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతతోనే కాంగ్రెస్ గెలిచిందని, అంతే తప్ప ఆ పార్టీ గొప్పతనం ఏం లేదన్నారు. సమావేశంలో అర్బన్, రూరల్ అధ్యక్షులు పల్లె కుమార్, బి.సురేష్, నాయకులు రంగు రాములు, కొలుపుల శంకర్, అలిసేరి రవిబాబు, రాజేష్, కొండా యాకన్న, శేఖర్, విజయ్‌కుమార్, వినయ్‌శర్మ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అయ్యప్పస్వామి పడిపూజ

గూడూరు : మండల కేంద్రంలో బుధవారం రాత్రి అయ్యప్పస్వామి పడిపూజ కనుల పండువగా జరిగింది. సమ్మెట రితిక్‌తేజగౌడ్ కన్నెస్వామి ఇంట్లో అయ్యప్పస్వామి పడిపూజ ఏర్పాటు చేయగా, గురుస్వామి నరేష్‌శాస్త్రి, భానుశాస్త్రి ఆధ్వర్యంలో గణపతి, సుబ్రహ్మణ్య, అయ్యప్ప స్వామి అష్టోత్తర పూజలు చేశారు.

ధనుర్మాస వ్రత పూజలు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో ధనుర్మాస వ్రత పూజలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మహిళలు భక్తిశ్రద్ధలతో గోదారంగనాథుల సేవలో తరిస్తున్నారు. గురువారం మహిళలు మంగళహారతులతో వచ్చి స్వామివారు, అమ్మవారలకు స్వాగతం పలికి పూజలు చేశారు.

సాయినాథుడిని తాకిన సూర్యకిరణాలు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ పట్టణంలోని శ్రీసాయి మందిరంలో కొలువై ఉన్న షిర్డీ సాయినాథుడిని గురువారం ఉదయం 6.45 గంటలకు సూర్యకిరణాలు తాకాయి. బాబా మీద సూర్యకిరణాలు పడిన దృశ్యాన్ని భక్తులు తమ కెమెరాల్లో బంధించారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి

బయ్యారం : జిల్లావ్యాప్తంగా తెగుళ్లు సోకి నష్టపోయిన మిర్చి రైతులను ఆదుకోవాలని ప్రజాపంథా జిల్లా నాయకుడు జగ్గన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెగుళ్లు సోకిన మిర్చితోటలను సర్వే చేసి రైతులకు మేలు జరిగేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు సూర్యం, సత్యం, యాకయ్య, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నిరసన

నెహ్రూసెంటర్ : పార్లమెంట్‌లో ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేస్తూ వారిపట్ల బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ నేడు సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో నిరసన నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఫాసిస్టు విధానాలను అనుసరిస్తుందని ఆరోపించారు.

పరామర్శ

కురవి : మండలంలోని రాజోలు సర్పంచ్ మస్తాన్ తండ్రి మహబూబ్‌అలీ(85) అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, గురువారం మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మహబూబ్‌అలీ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ కోఆప్షన్ సభ్యుడు అయూబ్‌పాషా తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


కురవి: విద్యార్థులను అభినందిస్తున్న టీచర్లు


మహబూబాబాద్ రూరల్: ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కురవి : మండలంలోని కాంపల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు జశ్వంత్, అరవింద్ ఈ నెల 23న కామారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం అరుణశ్రీ తెలిపారు. ఈ మేరకు గురువారం విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు..

కురవి మండలంలోని చింతపల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఈనెల 28 నుంచి 30 వరకు రంగారెడ్డి జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ (స్కూల్ గేమ్స్ అండర్-17)పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం శంకర్ తెలిపారు. ఈమేరకు ఎంపికైన విద్యార్థులు అరవింద్, దినేష్, యశ్విని, శ్వేత, సౌమ్యశ్రీని పీఈటీ కమల్‌కిషోర్, ఉపాధ్యాయ బృందం గురువారం అభినందించారు.

విద్యార్థులకు అభినందన

కురవి మండలంలోని రాజోలు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రంగోత్సవ్ సెలబ్రేషన్ ఆల్ ఇండియా ఆర్ట్ కాంపిటేషన్‌లో బంగారు, రజత పతకాలు సాధించినట్లు హెచ్ఎం రవికుమార్ తెలిపారు. జాతీయస్థాయి చిత్రలేఖనం పోటీల్లో 8మంది బంగారు పతకాలు, ఇద్దరు రజత పతకాలు సాధించి అంతర్జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీలకు..

మహబూబాబాద్ రూరల్ : రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీలకు మహబూబాబాద్ మండలంలోని వీఎస్ లక్ష్మీపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్ఎం ప్రసాదరావు, పీఈటీ సమ్మెట ప్రేం కుమార్ గురువారం తెలిపారు. తొర్రూరు పట్టణంలోని ఎన్.వై.ఆర్.ఆర్ గ్రౌండ్స్‌లో రేపటి నుంచి 25వ తేదీ వరకు రాష్ట్రస్థాయి అండర్-14 బేస్ బాల్ పోటీలు జరుగుతాయన్నారు. ఇందులో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు జి.మధుప్రియ, వైష్ణవి, మౌనిక, సాత్విక్, వరుణ్, చరణ్ తేజ్, పి.మధుప్రియ పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, మోహన్, వెంకన్న, హరీష్, మహ్మద్ షేక్ అలీ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

హౌసింగ్ బోర్డు కాలనీలో చోరీ

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసం ఉండే కోట పద్మ తన కుమార్తెను అమెరికాకు పంపేందుకు ఈ నెల 17న హైదరాబాద్‌కు వెళ్లారు. తిరిగి 20న రాత్రి ఇంటికి వచ్చారు. తాళం తీసి ఇంట్లోకి వెళ్లి చూసేసరికి బెడ్రూం తలుపు తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించారు. గదికి ఉన్న కిటికీ వెంటిలేటర్ తొలగించి ఆ పక్కనే ఉన్న డ్రెస్సింగ్ టేబుల్, బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడి ఉండగా వాటిని చూసి చోరీ జరిగిందని గుర్తించారు. ఈ చోరీలో 12 తులాల వెండి, తులం బంగారు ఆభరణాలు, చెవి రింగులు, రూ.15,000 నగదు అపహరణకు గురయ్యాయి. ఈ సంఘటనపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా టౌన్ ఎస్సై విజయరాంకుమార్ ఘటన ప్రాంతాన్ని పరిశీలించారు.

రైలునుంచి జారిపడి వృద్ధుడికి గాయాలు

డోర్నకల్ : డోర్నకల్ రైల్వే స్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫారం పట్టాలపై గురువారం ఉదయం గాయాలతో పడి ఉన్న వృద్ధుడిని గుర్తించారు. గాయపడిన వృద్ధుడిని గుర్తించిన రైలు డ్రైవర్ పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న వృద్ధుడిని గమనించి 108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వృద్ధుడి వద్ద లభించిన ఆధారాల ప్రకారం విశాఖపట్టణం శివారు ఉప్పరిపల్లికి చెందిన నర్సింహారావుగా గుర్తించామని, అపస్మారకస్థితిలో ఉండటంతో పూర్తి సమాచారం అందలేదని తెలిపారు. ప్రమాదవశాత్తు రైలునుంచి జారిపడి గాయాలపాలై ఉంటాడని జీఆర్‌పీ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

మేకల కాపరి మృతి

కేసముద్రం : మండలంలోని కోరుకొండపల్లికి చెందిన మేకలకాపరి ఎసల్ల చంద్రయ్య(61) గురువారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన చంద్రయ్య ఎప్పటిలాగే తనకున్న మేకలను మేపేందుకు ఊరి బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో సాయంత్రం ఓ రైతుకు చెందిన పంటపొలంలో అతడు కిందపడిపోయి ఉండగా, అక్కడున్న కొంతమంది వెళ్లి చూశారు. దీంతో అప్పటికే చంద్రయ్య మృతి చెందినట్లు గుర్తించారు. చంద్రయ్య గుండెపోటుతో మృతిచెందినట్లు స్థానికులు భావిస్తున్నారు.

చలి మంట అంటుకుని బాలికకు గాయాలు

కొత్తగూడ : చలి మంటలు అంటుకుని బాలికకు గాయాలైన సంఘటన మండలంలోని బక్కచింతలపల్లి గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన పాడిపశువుల రజిత చలి తీవ్రత తట్టుకోలేక ఇంటి ఎదురుగా చలి మంటలు కాగుతుండగా ప్రమాదవశాత్తు దుస్తులు అంటుకున్నాయి. తల్లిదండ్రులు మంటలార్పి మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నర్సంపేట ఆస్పత్రికి పంపించారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు


నెహ్రూసెంటర్: కేక్‌కట్ చేస్తున్న సాయినాయక్


పేదలకు పండ్లు అందజేస్తున్న అమ్జద్


రక్తదానం చేస్తున్న శ్రీనివాస్

నెహ్రూసెంటర్ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను గురువారం జిల్లా కేంద్రంలోని నెహ్రూసెంటర్‌లో బాణసంచా కాల్చి, కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబునాయక్‌కు తండాకు చెందిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమాని మాలోత్ సాయినాయక్ మాట్లాడుతూ.. ప్రతి ఏడాది జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్నట్లు, యూత్ ఐకాన్‌గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇందుభారతి, ప్రశాంత్, షబ్బీర్, వినోద్, తిలక్, అనిల్, రాంకుమార్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం, ఆక్సిజన్ సిలిండర్ల అందజేత

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన జగన్‌మోహన్‌రెడ్డి అభిమాని, శ్రీనివాస ఎంటర్‌ప్రైజెస్ యజమాని బాణాల శ్రీనివాస్ ప్రభుత్వ ఆస్పత్రికి ఒక రోజుకు సరిపడా ఆక్సిజన్, 108 అంబులెన్స్‌లకు 50 ఆక్సిజన్ సిలిండర్లను గురువారం ఉచితంగా అందజేశారు. అనంతరం రక్తదానం చేసి అభిమానం చాటుకున్నాడు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ..ఐదేళ్ల నుంచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా రక్తదానం, ఆక్సిజన్ సిలిండర్లను అందజేస్తున్నామన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, డీసీహెచ్ఓ డాక్టర్ వెంకట్రాములు, జగదీశ్వర్ మాట్లాడుతూ.. ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో రక్తదానం చేయడం, ఆక్సిజన్ ఉచితంగా అందించడం గొప్పవిషయమని, ఇలాంటి కార్యక్రమాలు ఇంకా నిర్వహించాలని అభినందించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

మహబూబాబాద్ రూరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మహబూబాబాద్ పట్టణంలోని 25వ వార్డు నందమూరి నగర్ కాలనీకి చెందిన ముస్లిం యువకుడు, జనతా గ్యారేజీ నిర్వాహకుడు మెకానిక్ అమ్జద్ గురువారం పేదలకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమ్జద్ మాట్లాడుతూ.. రైల్వే స్టేషన్ ఆవరణలో ఉండే ఏ దిక్కులేని వారు చలికి వణుకుతూ ఉండగా తన వంతు సాయం అందించే అవకాశం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా కలిగిందని పేర్కొన్నాడు. వైఎస్సార్ మాదిరిగానే జగన్ కూడా పేదలకు అండగా నిలుస్తున్నారని ఆయన సేవలను అమ్జద్ కొనియాడారు.

బాలిక అప్పగింత



మహబూబాబాద్ రూరల్ : తప్పిపోయిన బాలికను గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించి మానవత్వం చాటుకున్నాడు జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ డ్రైవర్ బాల్‌సింగ్ నాయక్. రూరల్ ఎస్సై బి.రాంచరణ్ తెలిపిన వివరాలు.. మహబూబాబాద్‌లోని శనిగపురంలో గురువారం మధ్యాహ్నం ఓ బాలిక ఏడుస్తూ కనిపించింది. అదే సమయంలో అటువైపుగా వెళ్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న బోడ బాల్‌సింగ్ నాయక్, రాంసింగ్ తండాకు చెందిన సురేష్ సదరు బాలికను గమనించారు. దగ్గరికి వెళ్లి బాలికతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కాగా ఆమె ఉమ్మడి ఖమ్మం జిల్లా టేకులపల్లి మండలం జగ్గుతండాకు చెందిన బానోత్ సురేష్-సోని దంపతుల కుమార్తె శ్రీలతగా గుర్తించారు. బాలిక తండ్రి బానోత్ సురేష్ చెట్లముప్పారంలోని తమ బంధువుల ఇంటికి వెళ్తుండగా మార్గ మధ్య శనిగపురంలో ఆటో దిగగా శ్రీలతను అక్కడే వదిలి వెళ్లిపోయాడు. అనంతరం ఏడుస్తున్న బాలికను చేరదీసి వివరాలు అడగగా ఆమె తన పూర్తి వివరాలు తెలియజేసింది. దీంతో బాలికను రూరల్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి అప్పగించారు. శ్రీలతను జిల్లా బాలరక్ష భవనం అధికారులకు అప్పగిస్తామని రూరల్ ఎస్సై రాంచరణ్ తెలిపారు.

బాధిత కుటుంబానికి చేయూత



తొర్రూరు రూరల్ : మండలంలోని వెలికట్ట గ్రామానికి చెందిన కొమ్ము సత్యనారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా గురువారం బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్థికసాయం అందించారు. పేద కుటుంబానికి చెందిన సత్యనారాయణ కుటుంబం హైదరాబాద్‌కు వెళ్లి జీవనం సాగిస్తోంది. దీంతో రోడ్డు ప్రమాదానికి గురై ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి అనాథలుగా మిగిలిన భార్య, పిల్లలకు గ్రామస్తులు చేయూతనిచ్చారు.